# వరాహ నరసింహస్వామి

**వి.** నరసింహస్వామి అనే దైవం మీద భక్తి ఉన్నవ్యక్తి ఒకాయన నల్గొండ జిల్లాలో అవతరించి, అక్కడే చదువుసంధ్యలు ముగించుకొని పై చదువులకని హైదరాబాద్ వెళ్ళి, అక్కడ సాక్షాత్ సెక్రటేరియట్‌లో ఉద్యోగం సంపాదించిన గొప్ప సమర్థుడు.

అతని ప్రస్తుత ఆకార విశేషాలివి. ఎత్తు 5'.5'', బరువు 89 కిలోలు ఉన్న ఆ శరీరం చూస్తే కనీసం 100 కిలోలయినా లేకుండా ఉంటుందా అని అనిపించడంలో తప్పులేదు. దానికి తగిన కారణాలు ఉన్నాయి. అతని ముఖమే లావుగా వుంటుంది. దాంతోబాటు అతని బుగ్గలు బాగా పొంగిన బూరెల్లా ఉంటాయి. శరీరం దాదాపు జపాన్‌లోని సుమోరెజ్లర్ టైప్‌లో ఉంటుంది. అతను ఆడమనిషిగా పుట్టి ఉంటే 'బ్రా' విషయంలో చాలా బాధపడేవాడు. అతని పొట్టకు దాదాపు 8 నెలల స్టేటస్ ఉంటుంది. అతను పాంట్స్‌ను ఎలా పెట్టి ఉంచినా అది మాటిమాటికీ అధఃపతనం చెందుతూనే ఉంటుంది. బెల్ట్‌తో కట్టి ఉంచినా దాని ఆరోహణ - అవరోహణా క్రీడకు పెద్ద ఆటంకం ఏమీ ఉండదు. హిడింబి నితంబాలు అతనికి మూలధనం అంటే అది అతిశయోక్తి కాదు. దానికి ఉచితమైన పరిమాణంలో ఊరువులు, పిక్కలు ఉన్న కాళ్ళకు దిమ్మిసలు అనే అపరనామధేయాన్ని ఎవరో రసికుడు పురస్కరించాడు. సదరు స్వామికి భార్యకంటె మంచి రంగు ఉంది అని చెబితే భార్య రంగు కారు బొగ్గ నలుపని, అతను ఆమె మీద కొంచెం మెరుగని కాదు అర్థం. ఆమె రంగు తెలుపే. కానీ అతని రంగు పండు నిమ్మకాయ వంటిది. అతను జుట్టును ఒక అంగుళం కంటె ఎక్కువ పెరగనీయడు కానీ వెనక మాత్రం చిన్న పిలక వేలాడుతూ ఉంటుంది. ఫాలభాగం వెడల్పు తక్కువ. ఎప్పుడూ ఆశ్చర్యాన్ని నింపుకున్నట్లుగా అతని

విస్ఫారిత నయనాలుంటాయి. చక్కని ఆకారం ఉన్న బెంగుళూరి మిరపకాయలాగా ఉంటుంది అతని ముక్కు. అతని పెదవులు ఎలా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే - ఆ ప్రదేశంలో ప్రాధాన్యత అతని దంతాలదే. అతని పై పలువరుస రైలు ఇంజనుకు ముందున్న 'కౌకాచర్'లా దాదాపు 45 డిగ్రీలు ముందుకు లేచి ఉంటుంది. పళ్ళు ఎలాంటి ఆకారంలో ఉన్నా చాలా నీట్‌గా పెట్టుకుంటాడు. కిళ్ళీలు నమిలి పళ్ళు పాడుచేసుకోవడం అతనికి సుతరామూ ఇష్టం లేదు. పై పళ్ళు చిన్న పిల్లలకు భయం కలిగించేలా ఉన్నా, కిందిపళ్ళు మామూలుగానే చిన్న సైజులో ఉన్నాయి. అయితే, ఆ రెండు పళ్ళవరుసలకు మధ్య ఉన్న ఖాళీవల్ల, అంతేకాక, పైపెదవి పై పలువరుసను కప్పి కింది పెదవికి దగ్గరగా వచ్చే అవకాశం లేకపోవడంవల్ల కూల్‌డ్రింక్స్‌ను 'స్ట్రా'తో తాగే ప్రయత్నమే ఆయన ఎప్పుడూ చేయలేదు. అదేవిధంగా రెండు పెదవులను కలిపి చేయాల్సిన పనులను వేటినైనా చేయడం అతనివల్ల కాదు. ఉదాహరణకు, కాలేజీలో చదువుకొనేటప్పుడు ఎవరైనా అమ్మాయికి విజిల్ కొట్టాలనిపించినా కొట్టలేకపోయేవాడు. అతను గురకలు తీసేటప్పుడయినా విజిల్ సౌండ్ రాదు.

అంత స్థూలమైన శరీరం ఉన్నా కూడ ఆయన బరువు కేవలం ఇంతేనా అని సందేహిస్తే దగ్గరి స్నేహితులు ''ఆ స్వామిది, వట్టి ఊద శరీరమండీ. అతని లోపల ఉండేదంతా 'గాసే'నండి. నీటిలో పడితే అతను మునిగిపోడు'' అంటారు.

స్వామికి చాలా దగ్గరగా వెళ్ళి మాట్లాడితే మీరు అనవసరంగా ఇబ్బందిలో పడతారు. స్వామి మాట్లాడుతున్నపుడు ఒక రెండుమూడు అడుగుల వరకు ఒక 'నేచురల్ స్ప్రే' వస్తుంది... యు.డి. కోలోన్ లాంటిది. అదే కారణంవల్ల అతనికి దగ్గరగా కూర్చుని భోజనం చేయడం కూడ అపాయకరమే.

నరసింహస్వామి భార్య చాలాసాధుస్త్రీ, దాదాపు అయిదడుగుల ఎత్తున్న ఆమె బరువు 55 కిలోలే ఉంటుంది. చూడడానికి అంత అందగత్తె కాకున్నా ఆమె పళ్ళు చక్కగా ఉండడంవల్ల అది ఆమెకు ప్లస్ పాయింట్. భర్తకు మంచిరంగు ఉన్నందువల్ల కాబోలు ఆమె రోజూ పసుపురాసుకుని స్నానం చేస్తుంది. ఎక్కువ చదువులేని ఆమెకు ఎక్కువ తెలివి తేటలుగానీ లోకపరిజ్ఞానం గాని లేదు. ఇడ్లీ-సాంబార్, మసాలా దోసె, పొంగల్, పాయసం మొదలైన రుచికర పదార్థాలు తినడం ఆమెకు చాలా ఇష్టమని చెబితే చాలదు. సరిగా చెప్పాలంటే అవి ఎంత తిన్నా ఆమెకు చాలదు. కానీ ఆమె అదృష్టం చూడండి. ఎంత తిన్నా లావెక్కడం లేదు. అయితే, పాపం ఆ స్వామి వట్టి పవన భక్షణం చేసినా బెలూన్‌లాగ పెరుగుతాడు. ఆమెకు జీవితంలో ఎలాంటి కోరికలు లేవు. మంచి మంచి

పట్టు చీరెలు కట్టాలని కూడ లేదు. వాళ్ళ వివాహం జరిగి ఇప్పటికి 18 సం.లు దాటింది. రెండు బుజ్జికాళ్ళు ఇంట్లో నడిస్తే చూచే అదృష్టం కలగకపోవడంవల్ల స్వామికి విషాదం ఉంది కాని అతని భార్యకు అలాంటి ఆలోచన కూడా రాదు. ఆమె స్వప్నాలలో ప్రత్యక్షమయ్యేవి సాధారణంగా మధురమైన ఫలహారాలు లేదా తెలుగు లేక తమిళ సినీమాలలో 'వివాహ భోజనంబు' లాంటి సీనులు. స్వామి ఆమెను ఆర్నెల్లకు గాని, సంవత్సరానికిగాని సినీమాకు తీసుకొనిపోవచ్చు, లేక తీసుకొనిపోక పోవచ్చు. కానీ ఇంట్లో కలర్ టీవీ ఉండడం వల్ల ఏమయినా చిరుతిళ్ళున్న గిన్నెల్ని ఒళ్ళో పెట్టుకుని టీవీ ముందు కూర్చుంటే చాలు అదే ఆమెకు స్వర్గం. అప్పుడప్పుడు పక్క ఇళ్ళల్లో విసిఆర్‌లో ఏవయినా సినీమాలు చూస్తున్నపుడు అక్కడ ఆతిథ్యం స్వీకరించడమయినా ఆమెకు సంతోషమే. అంత పరమ సుఖంగా జీవితం సాగుతున్నపుడు ఒక బిడ్డ లేడని విచారం కొని తెచ్చుకోవడం అనవసరం కాదా అని ఆమె హృదయపూర్వకమైన అభిప్రాయం.

బి.ఏ. లిటరేచర్ చదివి సెకండ్ క్లాసులో పాసయ్యాక ఎక్కువ ఆలస్యం కాకుండానే స్వామికి ఉద్యోగం వచ్చింది. అతను సెక్రటేరియట్‌లో యల్.డి.సి అంటే ఇప్పటి జూనియర్ అసిస్టెంట్‌గా 1972లో చేరాడు. 1976లో అతనికి వివాహమయింది. అతనికి పిల్లలు పుట్టనందుకు చాలామంది ఆయన వెనక వెక్కిరిస్తూంటారు. అనేక సెక్షన్లలో జూనియర్ అసిస్టెంట్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశాక ఇప్పుడు అతను జిఎడిలో సెక్షన్ ఆఫీసర్ సింహాసనం మీద విరాజిల్లి ఉన్నాడు. చాలాకాలం అదే సెక్షన్‌లో పనిచెయ్యడంవల్ల ఆ సెక్షన్‌కు సంబంధించిన విషయాలన్నీ అతనికి సమగ్రంగా తెలుసు. అందుకే ఆ విభాగానికి దేవుడిలా వ్యవహరిస్తున్నాడు. ఈ కాలంలో అతని శరీరం బరువుకంటె మెదడు బరువే ఎక్కువయింది. జి.ఎ.డిలో కాలు పెట్టగానే తన విలువ పెరిగినట్లు ఆ రోజుల్లో అనిపించేది. కానీ ఇప్పుడు సెక్షన్ ఆఫీసర్ అయి చాలా కాన్ఫిడెన్షియల్ విషయాలు చూస్తుండడంవల్ల అతని స్థానం ఛీఫ్ సెక్రెటరీకి ఒకవాసి కిందా? ఒకవాసి పైనా? అనే సందేహం అతనికి అప్పుడప్పుడు కలుగుతుంది. మామూలుగా మితభాషి అయిన అతను ఇప్పుడు టాప్ సీక్రెట్‌వాడు అయిపోవడంవల్ల సెక్రెటేరియట్‌లో ఉన్న సాధారణ సహజీవులతో మాట్లాడడమే అతనికి ఇష్టం లేదు. ప్రస్తుతం అతని ముఖంలోని భావాన్ని గమనిస్తే మొత్తం ప్రపంచ భారమంతా అతని భుజాలమీదే ఉన్నట్టు అనిపిస్తుంది. జి.ఎ.డి గురించి ఎవరయినా మాట్లాడితే అప్పుడు ''అమెరికా వాళ్ళు చాలా బుద్ధిమంతులు. అందుకే 'ఓ మైగాడ్' (జిఓడి) అని మనం అంటే ఓ మైగ్యాడ్ (జిఎడి) అని వాళ్ళు అంటారు. గాడ్‌కు అయినా ఏం కావాలన్నా జి.ఎ.డి నుంచి ఆర్డర్ ఉంటేనే దొరుకుతుంది'' అని అంటూ స్వామి ఒళ్ళంతా ఊగేటట్టుగా నవ్వేవాడు. రహస్యంగా ఆయన కొందరి దగ్గర బడాయి

కొట్టేవాడు. ''ఈ పెద్ద ఐఏయస్, ఐపియస్ ఆఫీసర్లు ఉన్నారు కదా! వాళ్ళందరికీ నేనంటే భలే భయం. దాన్ని బైట పెట్టుకోవాలంటే వాళ్ళకు భలే సిగ్గు. అయినా నన్ను చూచినపుడు ఒక దొంగ నవ్వు నవ్వి 'ఏం స్వామీ! క్షేమమా? అని తప్పకుండా అడుగుతారు.''

స్వామి సహోద్యోగులకు, కింద పనిచేసేవాళ్ళకు అతనంటే పెద్ద ఇష్టం లేదు. 'అతనికి మంచి తెలివి తేటలున్నాయి. పనివిషయంలో ఎంతో సమర్థుడు' అని అందరూ ఒప్పుకుంటారు. కానీ అతను ఇతరులను గాడిదల్లా చూస్తాడు.

''ఒక్కడికి కూడా రూల్సు, రెగ్యులేషన్స్ ఏమీ తెలియవు. ఎంతకాలం సెక్రటేరియట్‌లో పనిచేసినా వీళ్ళు ఒక్క పని కూడా నేర్చుకోరు. వీళ్ళను బాగుచేయాలని బ్రహ్మదేవుడనుకున్నా సాధ్యం కాదు. ఒక్కొక్క ఫైలులో వీళ్ళు నేర్చుకోవాల్సిన ఎన్నో విషయాల్ని నేను రాసి ఇస్తుంటాను. వాళ్ళను పిలిచి అన్నీ బాగా తెలిసేటట్లుగ చెప్తుంటాను, మందలిస్తుంటాను, బెదిరిస్తుంటాను. కానీ ఏం చేసినా ఫలం నాస్తి'' అని కింది ఉద్యోగుల గురించి అంటాడు.

పై ఉద్యోగుల గురించి ''వాళ్ళందరికీ అన్నిటికీ ఈ స్వామే కావాలి. ఒకరోజు నేను ఆఫీసుకు రాకపోతే ఫైళ్ళు ఏవీ కదలవు. నా సెక్షన్ గురించి మాత్రం కాదు నేను చెప్పేది. జి.ఎ.డిలో ఎలాంటి సంశయ నివృత్తి కావాలన్నా ఈ స్వామినే అడగాలి. వేరే సెక్షన్ ఆఫీసర్లకు, అసిస్టెంట్ సెక్రటరీలకు పనేమయినా తెలిస్తేగదా! ఎలాగో సీనియర్ అసిస్టెంట్‌గా ముదిరి సెక్షనాఫీసరవుతాడు. ఆ పదవిలో ముదిరి అసిస్టెంట్ సెక్రటరీ... తరవాత డెప్యూటీ సెక్రటరీ కూడ అవుతాడు. దీనికంతా మెరిట్ అక్కర్లేదు కదా! సీనియారిటీ అనే ఒక చచ్చుప్రమాణం ఉంటే చాలు. తొందరగా ప్రమోషన్ కావాలంటే పని నేర్చుకోనక్ఖరలేదు. కాకా పట్టడం వాళ్ళకి బాగా తెలుసు. ఇదికూడ వాళ్ళు నేర్చుకున్నది కాదు. జన్మతః వచ్చిందేకదా! ఒక యమ్.యల్.ఏకో, మంత్రికో బంధువయితే చాలు. వాళ్ళే అతన్ని పైకి ఎత్తేస్తారు. శివ శివా! గుర్రాల్ని, గాడిదల్నీ ఒకేగాట కట్టేస్తే ఎలా? ఈ జాయింట్ సెక్రటరీకి, సెక్రటరీకి పని ఎలా తెలుస్తుంది? ఈ ఐ.ఏ.యస్ అన్న మూడు అక్షరాలు సంపాదించినంత మాత్రాన ఆఫీసు వ్యవహారమంతా నేర్చుకోకుండా వస్తుందా? సర్వజ్ఞపీఠం ఎక్కినట్లు ఉంటుంది వాళ్ళ నడక, మాట, చూపు, చేత. చక్కగా నోట్ ఫైలు తయారుచేసి ఇస్తే, లేక ఒక డ్రాఫ్టు రాసి చూపిస్తే ముందు వాళ్ళు చూచేది స్పెల్లింగు మిస్టేక్ ఏమయినా ఉందా అని... ఈ స్వామికా ఇంకా వాళ్ళు ఇంగ్లీషు నేర్పించేది? వాళ్ళు చేసిన ఎన్నో స్పెల్లింగ్ మిస్టేకులు, వ్యాకరణ దోషాలు నేను పట్టుకున్నాను. ఈ 'కామా' ఇక్కడే కదా పెట్టాల్సింది? ఈ ఫుల్‌స్టాప్‌కు బదులుగా సెమీకోలన్ కదా పెట్టాలి? ఇక్కడొక ఫుల్‌స్టాప్ పెట్టి, తరవాతి

పదంనుంచి ఒక కొత్త సెంటెన్స్ మొదలు పెట్టకూడదా? ఇదండీ! వాళ్ళ త్రై అక్షర మహిమ. కానీ... ఈ స్వామికి చూపించకుండ ఒక్క ఫైలును కదిలించడానికయినా వాళ్ళకు ధైర్యం లేదు. అన్నింటికి నేనుండాల్సిందే. నాకు భోజనం, నిద్ర అక్కర్లేదా? సెలవు రోజుల్లో కూడా నేను పనిచేయాలి. రాత్రిలేదు... పగల్లేదు... ఎప్పుడు కావాలంటే అప్పుడు నన్ను పిలిపిస్తారు. నాకేమయినా ఓవర్ టైమ్ ఇస్తున్నారా? ఇంత ఎక్కువ పనిచేయించుకున్నా ఏదయినా 'అవుట్ ఆఫ్ టర్న్' ప్రమోషన్ ఇస్తారా? అబ్బే! అదేం లేదు. చూచినప్పుడంతా ఒక చిరునవ్వు... ఒక పలకరింపు... ఎప్పుడో ఒకసారి 'ఏం స్వామీ! కొంచెం కాఫీ తాగుతారా' అని అడగడం... నేను ఒకవేళ హఠాత్తుగా చచ్చిపోతే వీళ్ళేం చేస్తారు? తరవాత ఈ జి.ఎ.డిని మూసివేస్తారా? వెంకటేశ్వరా! వీళ్ళంతా ఎప్పుడిక పని నేర్చుకొనేది!'' అని ఆడంబర వాక్యాలు పలకడంలో అతను ప్రత్యేకమైన సుఖం పొందుతాడు.

ఎవరయినా స్వామిని అంతవాడివి, ఇంతవాడివి అని అంటే వాళ్ళు అతనికి చాలా మంచివాళ్ళు. ఎవరయినా స్వామిని విమర్శిస్తే వాళ్ళు గాడిదలు, వెధవలు, పనికిమాలినవాళ్ళు అవుతారు. కొంతకాలం నుంచి స్వామి స్కూటర్ మీదనే ఆఫీసుకు పోయివస్తున్నాడు. స్వామి ఆ స్కూటర్‌కు నిండుగా ఉంటాడు.

ఆ వాహనానికి అసలు స్పీడు తక్కువ ఉండడంవల్లనో, లేక స్వామి బరువును మోస్తూ పరుగెత్తడం ఇబ్బంది కావడంవల్లనో, లేక స్వామికి స్పీడుగా పోవడం భయం అయినందువల్లనో అదెప్పుడూ 30 కి.మీ.ల స్పీడును మించలేదు. లారీల పృష్టభాగం తెల్పుతున్నట్లు తన తక్కువ స్పీడు గురించి 'నిదానం ప్రధానం' అని చెప్తుంటాడు.

ఈమధ్య స్వామి ముఖంమీద ఒక విచిత్రమైన ఉపకరణం వెలిసింది. అది ఎల్లప్పుడూ ఉండదు. స్కూటర్‌ను నడిపేటప్పుడు మాత్రమే ఉంటుంది. రోడ్డులో తిరిగే మిగిలిన వాహనాలన్నీ వదిలే కాలుష్యధూమం అంతా తన ''కాప్సికమ్'' ముక్కు పీల్చకూడదని ఆ ఉపకరణాన్ని ధరిస్తున్నాడు. దాన్ని ధరించినపుడు అతని ముక్కు కనిపించదు కనక అతని పర్సనాలిటీకి ప్రమోషన్ వస్తుందిగానీ వేరే ఏదో లోకం నుంచి దిగివచ్చిన ఒక స్పేస్ మనిషి మాదిరిగా అనిపిస్తాడు సామాన్య మానవులకు. కొంతమంది ఇతను పందా? అని వారిలో వారు అనుకున్నారు. బాగా లావుగా, తెల్లగా ఉండడంవల్ల అది మామూలు పందికాదు... మొదటిరకం 'లెంకాషేర్ పిగ్' అని ఎవరో ఒక సవరణ కూడా ప్రతిపాదించారు.

స్వామికంటె నాలుగయిదేళ్ళు చిన్నవాడయిన చంద్రశేఖర్ హోం డిపార్ట్‌మెంట్‌లో సెక్షనాఫీసర్‌గా పనిచేస్తున్నాడు. పోలీసు డిపార్ట్‌మెంట్‌ను నియంత్రించే సెక్షన్ కావడంవల్ల పదిరాళ్ళు సంపాదించుకోడానికీ, చాలా సబిన్‌స్పెక్టర్లతో, ఇన్‌స్పెక్టర్లతో పరిచయం

చేసుకోడానికి అతనికి అవకాశం దొరికింది. మామూలుగా హోం డిపార్ట్‌మెంట్ సెక్షనాఫీసరుకు అలాంటి పరిచయాలతో పనిలేదు కానీ ఆయన 'సెక్షనాఫీసరు' కావడంవల్ల తన పలుకుబడి పెంచుకోడానికి ఎక్కువమంది పోలీసాఫీసర్లతో స్నేహం చెయ్యాలన్న ఒక పెద్ద ఉద్దేశం అతనికి ఉంది. అంతేకాక ఆయన సెక్రటేరియట్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్‌కు ఒక చిన్న లీడర్ కూడ. తన మాటకారితనంతో ఇతరుల్ని పడగొట్టడం అతనికి నిరంతర వినోదం. అవసరాలకు మించినంత ఆదాయం అతనికి రావడంవల్ల కుటుంబ జీవితంమీద అతనికి విరక్తి పుట్టింది. పెరుగుతున్న ఆ విరక్తితోపాటు ఇతర స్త్రీలమీద రక్తి పెరిగింది. ఎక్కువసేపు నోటికి మాత్రమే పనిబెట్టే అతనికి ఆఫీసు పనిమీద ఆసక్తి లేకపోవడమే కాదు ఇంతవరకు అంటే జూనియర్ అసిస్టెంట్ నుంచి సెక్షనాఫీసరు అయ్యేవరకు ఎలాంటి పనీ నేర్చుకోలేదు - నాలుగు రాళ్ళు ఏదో ఒకదారిలో సంపాదించడం తప్ప. అయితే, నిప్పు కణికల్లాంటి మాటల్తో విప్లవ జ్వాలాప్రసంగాలు చేయడంలో ఘటికుడు. అసోసియేషన్ విషయాలు మాట్లాడేటప్పుడు అతను ముఖ్యమంత్రికి కూడ శిరోభారం అయ్యేవాడు. తలలో రెండు మూడుచోట్ల పేనుకొరుకుడువల్ల అతని హెయిర్ స్టైల్ ఇప్పుడు శాశ్వత బోడిగుండు అయింది. మొదట్లో తాను తిరుపతి వెళ్ళి వచ్చానని చెప్పేవాడు గానీ స్థిరంగా బోడిగుండు పెట్టుకోవలసి రావడంవల్ల హైదరాబాద్‌లో ఉన్న ఒక ఆఫీసరుకు మాటిమాటికీ తిరుపతివెళ్ళి రావడం సాధ్యం కాదుకనక, ఈ మధ్యకాలంలో 'నేను శేషన్ అభిమానిని' అని చెప్పుకోడం మొదలుపెట్టాడు. అయితే 'యూల్ బ్రిన్నర్' స్టైల్ అని చెప్పుకోవాలనుకున్నాడు కాని ఆ పేరుకు స్పెల్లింగ్ ఏమిటి అని ఎవరైనా అడిగితే, ఎందుకొచ్చినగోల' అని అనుకొని ఆ ఆలోచన విరమించుకున్నాడు. మామూలుగా అతనికి శిరస్త్రాణం ఉంటుంది. అయితే స్కూటర్ తోలేవాళ్ళకు అది అవసరమే కదా!

స్వామి ఇంటికి దగ్గర్లోనే చంద్రశేఖర్ ఇల్లు కూడ. స్వామి, చంద్రశేఖర్లు బద్ధ శత్రువులు కాదు కానీ అలాగని మంచి మిత్రులు కూడా కారు. వారిద్దరి మధ్య ఉన్న ముఖ్య మనోభావం పరస్పర అవజ్ఞ అని చెప్పవచ్చు. లేదా పరస్పర ద్వేషం అని కూడ చెప్పవచ్చు. పెళ్ళయిన పది సంవత్సరాలకే చంద్రశేఖర్ ముగ్గురమ్మాయిలకు, ఇద్దరబ్బాయిలకు తండ్రయ్యాడు. ఆ పంచ సంతానానికీ అచ్చంగా తానే తండ్రి అయినందువల్ల అతని గర్వం అంతా ఇంతా కాదు. ''అందుకే ఒక్క సంతానానికి కూడ పునాది వెయ్యలేని ఆ బోద శరీరావతారంగాడితో ఏమవుతుందనీ పని'' అని చాలా హీనంగా స్వామిని గురించి మాట్లాడేవాడు. పదిమందిలో స్వామిని అపహాస్యం చేయడం, స్వామిలేనప్పుడు అతన్ని గురించి చౌకగా మాట్లాడడం

చంద్రశేఖర్‌కు ఒక ప్రత్యేకమైన కిక్కు కలిగించేది.

ఆఫీసు పనిలో స్వామి చాలా సమర్థుడు కావడంవల్ల, అతనితో పోటీపడేవాళ్ళు తక్కువ కావడంవల్ల, చంద్రశేఖర్‌లాంటి మనుషులకు అతనంటే అసూయగా ఉండేది. స్వామి దృష్టిలో చంద్రశేఖర్‌లాంటి వాళ్ళు పురుగులు, సమాజంలో పరాన్నభుక్కులు

స్వామి ఈ మధ్య ముక్కుమీద ఒక ఆభరణం ధరించడం వల్ల అతనొక జంతువులాగా కనిపిస్తున్నాడని చంద్రశేఖర్ చాలా సంతోషించాడు. అతన్ని నవ్వులపాలు చేయడానికి ఇదొక సువర్ణావకాశమని దాన్ని గొప్పగా వాడుకోవాలని చంద్రశేఖర్ నిశ్చయించుకున్నాడు. బాగా ఆలోచించి ఒక ప్లాన్ తయారుచేశాడు.

రోడ్డు పక్కన ఉన్న స్వామి ఇంటికి ముందు ఒక చెట్టు ఉంది. ఆ చెట్టుకింద ఒకరోజు ఉదయం ఒక 'హుండీ' ప్రత్యక్షమయింది. ఆ హుండీపైన చెట్టుకు ''శ్రీ వరాహ నరసింహస్వామినే నమః'' అని రాసిన బోర్డు తగిలించి ఉంది. మొదటి రోజునే చంద్రశేఖర్, అతని మిత్రులు ఆ హుండీలో కొంచెం డబ్బువేసి స్వామి ఇంటివేపుకు తిరిగి కళ్ళు మూసుకుని ధ్యాన నిరతులయ్యారు. ఈ దృశ్యాన్ని చూచిన ప్రజానీకం గొర్రెల మందలాగా చంద్రశేఖర్‌ను, అతని మిత్రుల్నీ అనుసరించింది.

ఉదయం స్వామి ఇంటి నుంచి బైటికి వచ్చేటప్పటికి, చంద్రశేఖర్ అతని మిత్రులు ఆ చెట్టుకింద నిలుచుని ఉన్నారు. ముఖంమీద ఆ శుద్ధవాయు పరికరాన్ని అమర్చుకుంటూ స్కూటర్‌మీద వస్తున్న స్వామిని చూచి చాలామంది నమస్కారం పెట్టారు. మామూలుగా రోజూ ఎక్కువమంది తనకు నమస్కారం పెట్టకపోయినా రోజు రోజుకు ఎక్కువవుతున్న తన గొప్పదనంవల్ల తనకు ఎక్కువ నమస్కారాలు లభించడంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు అని తృప్తిపడ్డాడు. సాయంత్రం తిరిగి వచ్చేటప్పటికి దాదాపు ఏడున్నరగంటలయింది. ఆ సమయంలో కూడ కొందరు హుండీలో డబ్బులు వేయడం స్వామి ఇంటివైపు తిరిగి నమస్కరించడం ఆయన గమనించాడు. తరవాతిరోజు ఆఫీసుకు వెళ్ళేటప్పుడు కూడ అదే వ్యవహారం జరిగింది. స్వామి సెక్రటేరియట్ చేరుకోగానే చంద్రశేఖర్, ఇంకా కొందరు సహోద్యోగులు అక్కడ వరసగా నిలబడి నమస్కరించి, స్వాగతం పలికారు. కొందరు గుంపుగా నిలబడి పెద్దగా నవ్వారు. కొద్దిరోజుల్లోనే స్వామి ఇంటిదగ్గర, దారిలో అక్కడా, ఇక్కడా, సెక్రటేరియట్‌లోపల స్వామికి నమస్కారం పెట్టేవాళ్ళ సంఖ్య ఎక్కువయింది. దాంతో నవ్వుల టపాకాయల జడల పాడుగు కూడా ఎక్కువయింది. ఇప్పుడిప్పుడే ఇందులో ఏదో అంతరార్థం ఉందని స్వామికి మెల్లగా అనిపించడం మొదలు పెట్టింది. తన ఇంటిముందు, సెక్రటేరియట్‌లోపల తనను చూడగానే జనం గుంపుగా వచ్చి ఎందుకు

నమస్కారం పెడుతున్నారు? అలా చేయడంలో తప్పు లేదుగాని మరి కొంతమంది ఎందుకు నవ్వుతున్నారు?

స్వామి ఇంటిముందు 'హుండీ' వెలసి దాదాపు రెండు వారాలయింది. ఆరోజు సోమవారం. ఉదయం స్నానం, పూజ - అన్నీ ముగించి స్వామి భోజనం చేస్తున్నాడు. అప్పుడు ఎవరో కొందరు ఇంటి వరండాలోకి వచ్చి మాట్లాడుతుండడం విని స్వామి ధర్మపత్ని బైటికి వెళ్ళి చూచింది. వచ్చినవాళ్ళు అయిదుగురు ఆమెను చూడగానే చాలా భక్తితో నమస్కరించి అర్జంటుగా స్వామివారిని చూడాలని అని విన్నవించుకున్నారు.

స్వామి భోజనం త్వరగా ముగించి బైటికి వచ్చేటప్పటికి ఆ భక్తపంచకం 'వరాహనరసింహ స్వామినే నమః' అని భక్తి పారవశ్యంతో ఆయన పాదాలమీద పడింది. అది చూచి స్వామి, స్వామి పత్నికూడ ఆశ్చర్య చకితులయ్యారు. ''హేమిటిది! హేమిటిది! మీ అందరికీ ఏమయినా వెర్రెక్కిందా?'' అని స్వామి అడిగాడు.

''స్వామీ! తమదర్శనం దొరికితే వెర్రిపట్టినట్టే... మేమన్నీ మర్చిపోతాం... ఈ ప్రపంచాన్నే మర్చిపోతాం... స్వామిని ఇంత దగ్గరగా దర్శించే మహాభాగ్యం కంటె వేరే పెద్ద అదృష్టం ఏమయినా ఉంటుందా?'' అని ఆ దరిద్ర పాండవ బృందంలో భీముడని చెప్పదగినవాడు పరమభక్తి పూర్వకమైన గొంతుతో అన్నాడు.

''నేనేమన్నా సన్యాసినా? బాబానా? లేక కలియుగ అవతారమా?'' అని స్వామి కొంచెం కోపంగా అడిగాడు.

''స్వామీ! తమ నోటినుంచే ఆ పదాలు వచ్చినందుకు మాకు పరమానందంగా ఉంది. ఈ కలియుగాంతంలో కల్కి అవతారం ఆవిర్భావం అవుతుందని మేం విన్నాం. మానవులు వినాశనప్రాప్తంలో పడకుండా రక్షించడానికి తమరు ముందుగానే అవతరించారు'' అని చెప్తూ ఆ భక్త భీముడు చేతులు తలమీదికెత్తి జోడించి నమస్కరించాడు. మిగిలిన నలుగురు కూడ భయభక్తులతో చేతులు జోడించి నిలబడ్డారు.

''ఏంటి నువ్వనేది? అవతారమా? ఏమవతారం?'' అని కోపంగా అడిగాడు స్వామి.

''స్వామి ఉగ్ర నరసింహస్వామి అవుతుంటే మాకు భయంగా ఉంది. స్వామి గురించి ఇంతకాలం మేము తెలుసుకోనందుకు క్షమాభిక్ష యాచిస్తున్నాం. ఈ హుండీ భక్తులు చెల్లించిన మొక్కుబడులతో నిండిపోయింది. దయచేసి స్వామీ! దీన్ని స్వీకరించండి. ఇంకొక హుండీ భక్తులకోసం అక్కడ పెట్టి ఉంచాము'' అని చెప్తూ ఆ భక్తశిరోమణి ఆ హుండీని

స్వామివారి పాదాల దగ్గర పెట్టాడు. స్వామికి దాన్ని తన్నాలనిపించింది కాని తన పాదం భవిష్యత్తు దృష్ట్యా అలా చెయ్యలేదు. కానీ మరింత కోపంతో

''మీరెందుకిలా పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు? మిమ్మల్ని ఇక్కడికి ఎవరు పంపారు? ఈ హుండీ ఆ చెట్టుకింద ఎవరు పెట్టారు? దీన్ని నా దగ్గరికెందుకు తెచ్చారు?'' అని అడిగాడు.

స్వామీ! మీపేరు వినగానే మీ అవతారం గురించి స్ఫురించాలి. కానీ మా అజ్ఞానం కారణంగా మాకు ఆలస్యంగా జ్ఞానోదయం కలిగింది. ఈ మధ్య స్వామివారు స్కూటర్‌మీద ప్రయాణం చేస్తున్నప్పుడు తమ నాసికాచ్ఛాదనం చూచిం తర్వాతనే తమ అసలు అవతారం గురించి సుస్పష్టమయింది. ఆ పరికరం తమ ముఖాన్ని అలంకరించి ఉన్నప్పుడు తమ ముఖకాంతి అవర్ణనీయం. ఏం తేజస్సు? ఇక్కడ్నుంచి సెక్రటేరియట్ వరకు దారిపొడుగునా స్వామి దర్శనం కోసం జనం రోజూ వేచి ఉంటున్నారు'' అని ఆ భీమ భక్తుడు కళ్ళు మూసుకుని మరీ చేతులు జోడించి చెప్పాడు.

స్వామి కోపంతో వణికిపోతూ ''ఏ వెధవ మిమ్మల్ని ఇదంతా చేయమని పంపాడు'' అని అరిచాడు.

''మా భక్తులందరిలో అగ్రేసరుడయిన వాడు తమ ఆఫీస్‌లో సెక్షనాఫీసర్‌గా పనిచేస్తున్న శ్రీశ్రీ చంద్రశేఖరానందజీనే. వారి అతులితమైన భక్తియే మమ్మల్ని కూడ ఈ భక్తిమార్గానికి చేర్చింది. వారే ఈ హుండీని అక్కడ ప్రతిష్ఠించారు. ఈరోజు ఉదయం ఒక కొత్త హుండీని అక్కడ పెట్టి పాత హుండీని తమపాదాల చెంతకు చేర్చాలని వారే ఆజ్ఞాపించారు. వరాహ నరసింహస్వామి పూజ కోసం మేమేం చేయడానికయినా సిద్ధంగా ఉన్నాం'' అని అచంచల భక్తితో అన్నారు.

ఇదంతా వింటున్న నరసింహస్వామి ఉగ్ర నరసింహుడు కాకుండ ఉండలేకపోయాడు.

''పోరా! దీన్ని తీసుకు పోరా! ఆ చంద్రశేఖర్ గాడి అయ్యకిచ్చుకొమ్మని చెప్పురా! అతనికి నేను మంచి పాఠం నేర్పిస్తానని చెప్పు'' అని చెప్తూ స్వామి ఇంట్లోకి వెళ్ళి తలుపులు గట్టిగా మూసుకున్నాడు.

కొంచెం సేపయ్యాక స్వామి స్కూటర్లో బయల్దేరేటప్పుడు ఆయన ముఖంమీద ఆ నాసికాచ్ఛాదనం లేదు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టి తన ఊపిరితిత్తుల ఆరోగ్యంకోసం కొన్న ఆ శాస్త్రీయోపకరణాన్ని పాపం పారేయాల్సి వచ్చింది. దారిలో ఆయనకు నమస్కారం

పెట్టడానికి ఎదురుచూస్తున్న కొందరు దుర్మార్గులకు, సెక్రటేరియట్‌లో రోజువారీ జరుపుతున్న డ్రామాకు తయారుగా ఉన్న చంద్రశేఖర్& కోకు దూరంనుంచి స్కూటర్‌ను చూడగానే నిరాశ కలిగింది. సూకర సూచకం అతని ముఖంమీద లేకపోవడంవల్ల వరాహ నరసింహావతారానికి సమర్పించవలసిన భక్త్యాదరాలు స్వామికి ఇయ్యలేక పోయినందువల్ల ముక్కోటి దేవతల్లో ఒక దేవుడు అంతరించిపోయినంత దుఃఖం వాళ్ళకు కలిగింది.

స్వామికి చంద్రశేఖర్‌తో ముఖాముఖి యుద్ధం చేయాలనిపించింది. కానీ దానికి కావలసిన ధైర్యం తెచ్చుకోడానికి కనీసం వచ్చే అవతారంలోనయినా వీలుపడుతుందా లేదా అని తెలుసుకోడానికి ఇంకో అవతారం కావాలి కదా? వచ్చే అవతారంలో ఒకవేళ తాను ఒక ఎలుకగా గాని, పిల్లిగా గాని జన్మిస్తే అప్పుడీ చంద్రశేఖర్ కుక్కగా పుడతాడేమో?

ఆ రోజు రాత్రి ఇంటికి చేరాక స్వామి ఆ పరికరాన్ని ముఖంమీద పెట్టుకొని కొంచెం సేపు అద్దంముందు నిలబడ్డాడు. మెల్లమెల్లగా తాను వరాహ నరసింహమూర్తిగా మారిపోతున్నట్లు అతనికనిపించింది. చూచేవాళ్ళు తననిలా అనుకున్నా తప్పులేదని ఆయనకు తోచింది.

ఏమయినా చంద్రశేఖర్‌కు మాత్రం పాఠం చెప్పాల్సిందే అని దృఢంగా నిర్ణయించుకున్నాడు.

తత్ఫలితంగా -

చంద్రశేఖర్ ఇంటిముందు రోడ్డుకవతల ఉన్న ఖాళీ స్థలంలో ఒక కార్పోరేషన్ వారి మూత్రశాల ఆవిర్భవించింది - అతనికీ, అతని కుటుంబ సభ్యులకూ నిరంతర అసహ్యాన్ని ప్రసాదిస్తున్న ఒక కలియుగ అవతారం లాగా.

దాని నిర్మాణం జరుగుతున్న రోజుల్లోనే చంద్రశేఖర్ దాన్ని ఆపడానికి తన శక్తియుక్తులన్నీ ప్రయోగించి చూచాడు. కానీ స్వామి పలుకుబడి ముందు చంద్రశేఖర్ పోలీసు పరిచయాలు ఏమీ చేయలేకపోయాయి. చంద్రశేఖర్ భార్యకు, పిల్లలకు ఇంటిముందుకు రావడానికే ఇబ్బందికరంగా ఉందని గుర్తుకు వచ్చినప్పుడల్లా స్వామి సదా తెరిచి ఉండే తన నోటిని ఇంకొంచెం పెద్దగా తెరిచి పకాపకా నవ్వుతూ ఉంటాడు.

**(15-9-1994 నాటి ఆంధ్రభూమి సచిత్రవారపత్రికలో ప్రచురితం)**